సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

చవితికి ధరాఘాతం..!

- నిత్యావసరాల ధరలతో సామాన్యులు బెంబేలు
- పండగ పూటా ప్రత్యేక వంటలు కష్టమే..!

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి/కర్నూలు కార్పొరేషన్

పండుగల్లో వినాయచవితి ప్రధానమైన పండగే. వినాయక ప్రతిమల ఏర్పాటు నుంచి ఇంట్లో పిండి వంటల వరకూ అన్నింటా సందడి నెలకొల్పుతుంది. అలాంటి చవితికి ధరాఘాతం తప్పడం లేదు. నిత్యావసరాల ధరలతో సామాన్యుల బెంబేలెత్తుతున్నారు. పండగ పూట కూడా ప్రత్యేక వంటకాలు కష్టంగా మారనున్నాయి...

పూజ వస్తువులను విక్రయిస్తున్న మహిళలు

నిత్యావసరాల ధరలు రోజు రోజుకు పెరుగుతూ పోతున్నాయి. పెరిగిన ధరలతో వినాయక చవితి పండుగకు ప్రత్యేక వంటలు కష్టమని సామాన్యులు వాపోతున్నారు. వినాయక చవితికి ఉండ్రాళ్లు, కుడుములు, బక్షాలు వంటి పిండి వంటలు చేసుకుంటారు. వాటికి ఉపయోగించే నిత్యావసరాల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. కర్నూలు నగరంలో కిలో శనగ బేడలు రూ.110, బెల్లం రూ.70, మైదా రూ.45, లీటరు నూనె రూ.120 నుంచి రూ.170 వరకు, 100 గ్రాముల నెయ్యి రూ.80గా ఉంది. ఆదోనిలో కంది బేడలు కిలో రూ.150, శనగ బేడలు రూ.120, లీటరు పామాయిల్ రూ.120, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.150, కిలో మైదా పిండి రూ.50, బెల్లం రూ.60 ఉన్నాయి. నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంటిలో పిండి వంటలు చేసుకునేందుకు కనీసం రూ.500 వెచ్చించాల్సి వస్తోంది. దీంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కొందరు ఉన్న దాంతో కొద్ది మొత్తంలో పిండి వంటలు చేసుకుంటుండగా మరికొందరు పాయసంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. మరో వైపు గ్యాస్ ధర కూడా ఆకాశాన్ని అంటుతోంది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.908గా ఉంది. దీంతో చాలా మంది ఇంట్లో స్టవ్ వెలిగించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

పెరిగిన బొమ్మల ధరలు..

వినాయకుడి బొమ్మలకు డిమాండ్ పెరగడంతో ధరలు కూడా భారీగా పెంచేవారు. గత మూడేళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం విగ్రహాల ధరలు భారీగా పెరిగాయి. నాలుగు అడుగుల విగ్రహం గతంలో ఐదారు వేలు ఉంటే ఇప్పుడు రూ.తొమ్మిది వేల నుంచి రూ.పది వేలకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది విగ్రహాల విక్రయాలు భారీగా ఉంటాయని వ్యాపారులు ఆశించినప్పటికీ బుకింగ్స్ మాత్రం ఆ స్థాయిలో లేకపోవడంతో తయారీదారులు కొంత కలవరానికి గురవుతున్నాయి.

అన్నీ బయటే కొనుగోలు..

ఒకప్పుడు పండుగకు కావాల్సిన వస్తువులను గ్రామాల నుంచి సేకరించేవారు. కానీ ప్రస్తుతం గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. వినాయక చవితికి కావాల్సిన వస్తువులను ఎక్కువగా మంది కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. మామిడి తోరణాల దగ్గర నుంచి పూలు, పండ్లు, తమలపాకులు, ఒనగాయాలు, కొబ్బరికాయ, మోతిగాకులు, వెలక్కాయ, తుమ్మి, సీతాఫలం, బుక్కగులాలు, వెలగపత్రి, గరిక వంటి వాటిని మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. వీటి ధరలు కూడా తక్కువేం లేవు. కర్నూలు నగరంలో ఆ వస్తువులన్నీ కలిపి రూ.200కు అమ్ముతున్నారు. దాంతో వాటి దగ్గరికి వెళ్లాలంటే భయపడుతున్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏటా వానకాలంలో సహజంగా కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. కానీ మునుపెన్నడూ లేని విధంగా ధరలు ఆకాశాన్నంటాయి.

- అరుణ, కర్నూలు.

విపరీతంగా ధరలు పెరిగాయి

విపరీతంగా నిత్యవసర ధరలు పెరిగాయి. వినాయక చవితి చేయలేకపోతున్నాం. నిత్యావసర ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఏది కొనాలన్నా కేజీకి రూ.100 పైగానే ధరలు పలుకుతున్నాయి. దీంతో వినాయక చవితి చేయడం కష్టంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిత్యవసర వస్తువుల ధరలు అందుబాటులో తీసుకురావాలి.

- బండి గోపాల్, ఆదోని పట్టణం.

రైతులను మోసగిస్తున్న

పాలకులను ఎండగట్టాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతులను వివిధ రూపాలలో యూరియా, గిట్టుబాటు ధర, పత్తి దిగుమతి లాంటి విషయాలలో అన్ని కోనాలలో మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి మాట్లాడారు. ఢిల్లీ ఎర్రకోట నుండి ఆగస్టు 15న దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాటల శబ్దం ఆగక ముందే కేంద్ర ఆర్థిక శాఖ రైతులపై భారాలు వేసే ప్రయత్నం చేసిందన్నారు. ఈ మేరకు పత్తిపై దిగుమతి సుంకం తగ్గిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో బాగా పత్తి పండించే జిల్లా కర్నూలు జిల్లా అని, దానివల్ల బాగానష్టపోయే జిల్లా కూడా కర్నూలని అన్నారు. విదేశాల నుండి దిగుమతయ్యే పత్తిమీద ఉన్న 11శాతం సుంఖాన్ని రద్దు చేయడం ద్వారా ఇబ్బడి ముబ్బడిగా పత్తి దిగుమతి అయి, దేశంలో ఉన్న పత్తి రైతులను నాశనం చేస్తుందన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర రాష్ట్ర పాలకులే కారణమన్నారు. కేంద్రం బడ్జెట్లో ఎరువుల ధరల మీద సబ్సిడీ తగ్గించిందని, దీనివల్ల సబ్సిడీ మీద పెట్టే నిధులు తగ్గిపోతాయన్నారు. కేంద్రం ఇచ్చే గ్రాంట్‌కు ఆశపడి రాష్ట్రం ప్రకృతి వ్యవసాయం పేరుతో ఎరువులు వాడకండి అంటుందన్నారు. వాడకండి అంటే వినరు కాబట్టి ఎరువులే లేకుండా చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. అధికార పార్టీ నాయకులే యూరియాను దారి మల్లిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో అనేకచోట్ల రైతుల చేతుల్లో ఉన్న వందల ఎకరాల సాగు భూమిని వివిధ కారణాలు చెప్పి, పరిశ్రమల పేరుతో కార్పొరేట్ కంపెనీలకు దారా దత్తం చేస్తుందన్నారు. నెల్లూరు జిల్లా కరేడులో 16 వేల జనాభా, 18 గ్రామాలు, 11 వేల ఎకరాల భూమి ఉంటే భూమి నంత ఒక్క శిరిడి సాయి కంపెనీకి అప్పజెప్పారన్నారు. రైతులంతా భూములు కాపాడుకోవడం కోసం పోరాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. రైతులందరికీ యూరియా సరఫరా కోసం, గిట్టుబాటు, దిగుమతి సుంకాల ఎత్తివేత, రైతుల భూములు లాక్కోవడానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి నిర్మల, ఎండి ఆనంద్ బాబు, జి.రామకష్ణ, కె వెంకటేశ్వర్లు, కెవి నారాయణ, టి.రాముడు, ఎండి అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, కె.అరుణ, ఎం.రాజశేఖర్, విజయ్, లింగన్న, లక్ష్మన్న, నగేష్, గురుశేఖర్, నరసింహ, వీరశేఖర్, హనుమంతు, గోవిందు, మోహన్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్ అభివృద్ధికి కృషి

- రూ.6.74 కోట్ల సిటి స్కాన్‌ను ప్రారంభించిన మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అన్ని కార్పొరేట్ సౌకర్యాలు కల్పించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని పరిశ్రమలు,వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రూ.6.74 కోట్ల విలువగల 128 స్లైస్ డబుల్ సిటీ స్కానింగ్ మిషన్‌ను పరిశ్రమలు, వాణిజ్యం ,ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ మొదటినుంచి నాధ్యేయం నియోజకవర్గ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి అని అన్నారు. అందులో భాగంగా కర్నూలు సర్వజన ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయికి తీసుకుని వెళ్లే దానికి అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వారి సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.6.74 కోట్ల విలువైన 128 స్లైస్ డబల్ సిటి స్కాన్‌ను ఏర్పాటు చేయించామన్నారు. ఇటువంటి సేవలు కేవలం హైదరాబాదు, ముంబాయి వంటి మహా నగరాలలోనే అందుబాటులో ఉందని తెలిపారు. లక్షల సంఖ్యలో వైద్యం కోసం వచ్చే ఆసుపత్రులను నడపడం అంత సులభం కాద న్నారు. ఇక్కడ ఉన్న డాక్టర్లు, సిబ్బంది బాగాకృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాస్పత్రికి సౌకర్యాలు కల్పించడంలోనూ, భవనాలు నిర్మించడంలోనూ, క్రొత్త పరికరాలు తీసుకుని రావడంలోనూ నేను ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటానని తెలిపారు. రాష్ట్రమంతటా ప్రభుత్వ ఆసుపత్రులకు ఆక్సిజన్ సరఫరా రూ.38 క్యూబిక్ మీటర్ చొప్పున సరఫరా చేస్తున్నారని, కర్నూలు జనరల్ ఆసుపత్రికి కూడా సరఫరా చేస్తున్నారన్నారు. నా సొంత ఆసుపత్రికి కేవలం రూ.12 చొప్పున ఆక్సిజన్ సరఫరా చేయాలన్నానని తెలిపారు. వెంటనే కాంట్రాక్ట్ రద్దు చేయడం, లేదా సరఫరా ధరను తగ్గించడం జరిగే లాగా ప్రభుత్వ ధనం పొదుపు చేసేలాగా కృషి చేస్తున్నామని తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ ఈ సిటీ స్కానింగ్ వలన మన రాష్ట్రంలోని ఏడు జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఇతర సీటి స్కానింగ్‌లలో రోగి దాదాపు అరగంట సమయం వెచ్చించే అవసరం ఉంటుందని,దీని ద్వారా కేవలం ఐదు నిమిషాలలో మంచి క్వాలిటీతో పరీక్ష పూర్తవుతుందన్నారు. దక్షిణ భారతదేశంలోనే మొదటగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి ఈ స్కానింగ్ ను అందించిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిజిఎం శ్రీనివాసమూర్తి,పిఆర్ఒ శ్రీకాంత్ ఈ స్కానింగ్ మిషన్ విశిష్టతలను తెలిపారు. కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సిటి స్కాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టిజి.భరత్

డెంగీతో చిన్నారి మృతి

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి పట్టణంలోని ఆరవ వార్డుల నివాసం ఉంటున్న సిపిఐ మండల కార్యదర్శి కృష్ణ, సునీత దంపతుల చిన్నకుమార్తె మోక్షిత(7)డెంగీ జ్వరానికి గురై కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. గత వారం జ్వరానికి గురైన చిన్నారిని తల్లిదండ్రులు ముందుగా వెల్దుర్తి స్థానిక సిహెచ్‌సిలో వైద్యం చేయించారు. డెంగ్యూ లక్షణాలు తేలడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ కోలుకోలేక సోమవారం రాత్రి చిన్నారి మృతి చెందింది. ఒక్కగానొక్క కుమార్తె డెంగ్యూ జ్వరంతో మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. స్థానిక వైద్య సిబ్బంది పంచాయతీ అధికారులతో కలిసి మృతురాలు ఇంటి పరిసరాల్లో పారిశుధ్య పనులు, రసాయనిక మందులు పిచికారి చేశారు. చిన్నారి మృతి విషయం తెలుసుకున్న కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్ డిపిఒ భాస్కర్ మతదేహానికి నివాళులు అర్పించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీరితో డిఎల్‌పిఒ లక్ష్మీ, తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ ఉన్నారు. సరైన వైద్యం అందించడంలో ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామంలో పారిశుధ్య పనులు, దోమల నియంత్రణలో పంచాయతీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంతో ఉన్నారని చిన్నారి తండ్రి కృష్ణ అన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి : చిన్నారి మృతదేహానికి పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నివాళి అర్పించారు. జడ్‌పిటిసి దాది పోగు సుంకన్న, వైసిపి మండల అధ్యక్షుడు రవి రెడ్డి, మాజీ ఎంపిపి జ్ఞానేశ్వర్ గౌడ్, టిడిపి మండలాధ్యక్షుడు, బలరాం గౌడ్, సిఐటియు మండల అధ్యక్షుడు రాజు, చిన్నారి, తల్లిదండ్రులను పరామర్శించారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

రహదారి విస్తరణకు సహకరించాలి

-ఆస్తి కోల్పోయే యజమానులతో సమావేశంలో జెసి డాక్టర్ బి. నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర పరిధిలో దామోదరం సంజీవయ్య కూడలి నుండి కెవిఆర్ గార్డెన్స్ వరకు రహదారి విస్తరణలో ప్రభావితమయ్యే ఆస్తి యజమానులు నగరాభివృద్ధికి సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య కోరారు. మంగళవారం చెక్‌పోస్ట్ సమీపంలోని సంతోషి ఫంక్షన్ హాల్లో 82 మంది ప్రభావిత ఆస్తి యజమానులతో జెసి, కమిషనర్ పి.విశ్వనాథతో కలిసి సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. నగరానికి భవిష్యత్ రవాణా సౌకర్యాలు మెరుగుపడటానికి, రహదారి విస్తరణ అత్యవసరమని, త్వరితగతిన పనులు ప్రారంభించాలని, ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎవరూ నష్టపోకుండా, ఆస్తులు కోల్పోతున్న వారికి టిడిఆర్ బాండ్ల రూపంలో, భవనాలకు నగదు రూపంలో తగిన పరిహారం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కొందరికి బాండ్లు అందజేశామని, త్వరలో మిగిలిన వారికి కూడా ఇస్తామన్నారు.నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రభావితుల్లో ఇప్పటికే ముగ్గురు బాధితులకు టిడిఆర్ బాండ్లు అందజేశామని, మరో 47 మందికి త్వరలో పంపిణీ చేసే ప్రక్రియ జరుగు తుందన్నారు. ఒకేసారి ప్రభావితులందరూ సహకరిస్తే పరిహారం పంపిణీ త్వరగా పూర్తి చేసి, పనులను త్వరగా ప్రారంభించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

నగర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వినాయక చవితి పర్వదినాన్ని నగర ప్రజలు ఆనందంగా, ఐకమత్యంతో జరుపుకోవాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ.. వినాయక చవితి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమన్నారు. శాంతియుతంగా జరుపుకోవాలని కమిషనర్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

-పరిస్థితి విషమం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన ఓర్వకల్లు సమీపంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. గడివేముల మండలం మంచాలకట్టకు చెందిన అంబుల సోమశేఖర్(49) కర్నూలుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఓర్వకల్లు సమీపంలో గుర్తు తెలియని కారు ఢీకొంది. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం కర్నూలు జిజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించారు.

ఉల్లి ధర రూ.2 వేలకు తగ్గకుండా ఇవ్వాలి

-ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మార్కెట్‌లో ఉల్లిరైతులతో మాట్లాడుతున్న రామకృష్ణ, వెంకటేషులు

ఉల్లి పంటకు రూ.2000 తగ్గకుండా ధర ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు ఉల్లి మార్కెట్‌ను పరిశీలించారు. ఉల్లి మార్కెట్లో ధర చూస్తే చాలా ఘోరంగా ఉందని, రైతులకు ఏమాత్రం కూడా గిట్టుబాటు ధర కల్పించడం లేదని అన్నారు. గోనెగండ్ల, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల నుండి వచ్చిన రైతులకు క్వింటాలుకు కేవలం రూ.500 మాత్రమే ఇస్తున్నట్లు తెలిపారు. ఎకరాకు సుమారు రూ.లక్ష పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రూ. 500క్వింటాలకు ఇస్తే రైతుకు ఎలా గిట్టుబాటు అవుతుందని ప్రశ్నించారు. గతంలో టిడిపి ప్రభుత్వం రూ.2000 తక్కువ వస్తే రైతుకు బోనస్ ప్రకటించిందని, ఆ బోనస్ డబ్బులు కూడా ఇప్పటివరకు ఇవ్వలేదని, ఇప్పటికైనా ఆ బోనస్ చెల్లిస్తూ ఈ సంవత్సరం వేసిన ఉల్లి పంట రైతులకు నష్టం వచ్చినటువంటి వారికి బోనస్ రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమ గుంచి టిడిపి ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించడం లేదని విమర్శించారు. ఉల్లి రైతులకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పునా, నాసిక్ ఉల్లి పంట వచ్చి కర్నూలు జిల్లా రైతుల పొట్ట కొడుతున్నారని వీటిపై కలెక్టరు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా అధ్యక్ష పదవిపై కోల్డ్ వార్

-త్రిసభ్య కమిటీకి తెలుగు తమ్ముళ్ల ఆంతర్యం

-ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా పార్లమెంటు టిడిపి సంస్థాగత అభివృద్ధిలో భాగంగా పార్టీ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు మంగళవారం కర్నూలు నగరంలో త్రిసభ్య కమిటీ పర్యటించింది. ఈ మేరకు జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని కర్నూలు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అధ్యక్షతన కర్నూలు తనిష్క్ హాల్లో నిర్వహించారు. రాష్ట్ర కేంద్రం నుంచి త్రిసభ్య కమిటీ సభ్యులు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పార్టీ కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు మాజీ మంత్రి నక్కాఆనందబాబు, హిందూపురం ఎంపీ పార్థసారథి హాజరయ్యారు. ముందుగా టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి త్రిసభ్య కమిటీ సభ్యులతో పాటు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, మంత్రి టిజి.భరత్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పదవులతోపాటు పార్టీ వివిధ అనుబంధ సంఘాల పదవులను ఆకాంక్షించే అభ్యర్థుల నుంచి త్రిసభ్య కమిటీ వినతులను స్వీకరించింది. జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఎంపిక విషయంలో ప్రత్యేకంగా జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, అనుబంధ సంఘాల ప్రధాన నాయకులు, కారొ ్రేషన్‌ల చైర్మన్లు డైరెక్టర్లతో అభిప్రాయాలు సేకరించింది. జిల్లాలో మొత్తం సుమారు 350 దాకా వివిధ పదవుల కోసం అభ్యర్థనలు వచ్చినట్లు సమాచారం. జిల్లా అధ్యక్ష పదవి పైపాలకుర్తి తిక్కారెడ్డి, మైనార్టీసెల్ నాయకులు వాహీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆగిపోగు ప్రభాకర్, టిడిపి నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షులు జగదీష్ గౌడ్, టిడిపి రాష్ట్ర మహిళా నాయకురాలు అరుణకుమారి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి అశోక్ కుమార్, పలువురు ఆశావహులు పెద్ద ఎత్తున పోటీపడినట్లు తెలుస్తోంది. ఇందులో అధ్యక్ష పదవి కోసం ఒకే ఒక మహిళ పోటీపడినట్లు సమాచారం. దీనిపై పార్టీ అధినేత తుది నిర్ణయం తీసుకోనున్నారు.

కొలువు దీరిని కోడుమూరు మార్కెట్ పాలకమండలి

చైర్మన్‌గా, ఆకె పోగు సుగుణమ్మ ,వైఎస్‌చైర్మన్‌గా ఎల్లప్ప నాయుడు

ప్రజాశక్తి- కోడుమూరు

కోడుమూరు డోన్‌రోడ్డులోని మార్కెట్‌యార్డులో మంగళవారం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకెపోగు సుగుణమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ యార్డ్ సెక్రెటరీ సుందర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. చైర్మన్‌గా ఆకే పోగు సుగుణమ్మ, వైస్ చైర్మన్‌గా బోయ పొట్టనగిరి ఎల్లప్ప నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. మిగిలిన 14 మంది సభ్యులు కూడా ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు. వారు మాట్లాడుతూ కోడుమూరు మార్కెట్ యార్డ్ కమిటీకి మొదటి పాలకవర్గాన్ని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే దస్తగిరికి, కెడిసిసిబి చైర్మన్ డి విష్ణువర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇరువురి సహకారంతో కర్నూలు మార్కెట్ యార్డ్ కమిటీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈరోజు తొలి మార్కెట్ యార్డ్ కమిటీ పాలకవర్గ కమిటీని ఏర్పాటు చేసు కుంది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి, గంగాధర్, గోరంట్ల సర్పంచ్ బాలకృష్ణ, అయ్యప్ప, వెంకటగిరి రాజు, లద్దగిరి పట్టే కృష్ణ, పులకుర్తి త్రివేద్ , జనసేన పార్టీ నాయకులు ఆకే పోగు రాంబాబు, నాయకులు , మార్కెట్ యార్డ్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

చైర్మన్‌గా ప్రమాణం చేసి మాట్లాడుతున్న ఆకె పోగు సుగుణమ్మ

మహిళలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని బండిమెట్టలో వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహలను డాక్టర్ శంకర్ శర్మ పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మట్టి వినాయకులనే పూజిం చాలని డాక్టర్ శంకర్ శర్మ కోరారు. సామాజిక సేవలో భాగంగా బండిమెట్ట ప్రాంతంలో మహిళలకు డాక్టర్‌శంకర్ శర్మ మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వల్ల అనర్థాలు ఏర్పడి తీవ్రమైన ఎండలతో పాటు వర్షాలు సైతం ఎప్పుడు పడితే అప్పుడు వస్తున్నాయన్నారు. దీనివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. అందువల్ల వాతా వరణాన్ని కాపా డాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ముఖ్యంగా అడవులను సంరక్షించాలన్నారు. ఓజోన్ పొర దెబ్బతినడం వల్ల మానవాళి ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా కెమికల్స్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులు సహజ సిద్ధమైన మట్టి విగ్రహాల వల్ల ఎంతో ఉపయోగం ఉందని, అందరూ మట్టి విగ్ర హాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.కర్నూలు నగర వాసులకు ఆయన వినా యకచవితి శు భాకాంక్షలు తెలిపారు. తమకాలనికి వచ్చి మట్టి విగ్రహాలు పంపిణీచేసినందుకు స్థానిక మహిళలు డాక్టర్‌శంకర్‌శర్మకు ధన్యవాదాలు తెలిపారు.

హైదరాబాద్ హాఫ్ మారథాన్‌లో హిమబిందు ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

ఎన్ఎండిసి. ఆధ్వర్యంలో హైద రాబాద్‌లో నిర్వ హించిన 14వ ఎడిషన్ మారథాన్ విజయవంతంగా ముగిసింది. 2011 నుంచి కొన సాగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక రన్‌లో ఈసారి ఆగస్టు 23-24 తేదీల్లో సుమారు 28 వేల మంది ఔత్సాహిక రన్నర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కర్నూలు నగరంలోని నరసింహారెడ్డి నగర్‌కు చెందిన మారథాన్‌రన్నర్ టి.హిమబిందు హాజరై ప్రతిభ కనబరిచారు. దేశంలోనే రెండో కఠినమైన మార్గంగా పేరుగాంచిన ఈ హాఫ్ మారథాన్‌లో 3 ప్రధాన ఫ్లైఓవర్ల మీదుగా 240 మీటర్ల ఎత్తు ఎలివేషన్‌ను అధిగమిస్తూ ఆమె 21 కిలోమీటర్ల పరిగెత్తి పూర్తి చేశారు.ప్రతిభావంతురాలైన హిమబింధు ఈ హాఫ్ మారథాన్‌ను కేవలం 2 గంటల 53 నిమిషాల్లోనే ముగించడం గమనార్హం.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

'ఆరోగ్య కేంద్రం' భవనాన్ని ప్రారంభించాలి

- డివైఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డివైఎఫ్ఐ ప్రాంతీయ అధ్యక్షులు గోవర్ధన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ ఆలూరు ప్రాంతీయ కన్వీనర్ మైనా మాట్లాడారు. ఆలూరులో రోగుల సౌకర్యార్థం సుమారు రూ.కోటి వెచ్చించి సామాజిక ఆరోగ్య కేంద్రం నాడు-నేడు కింద భవనం నిర్మించారని తెలిపారు. భవన నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తోందని, రూ.లక్షలు వెచ్చించి ఎక్స్‌రే యంత్రం కూడా సమకూర్చారని చెప్పారు. నేటికీ నూతన సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించకపోవడం చాలా సిగ్గుచేటన్నారు. ఈ ఆరోగ్య కేంద్రం ప్రజలకు అందుబాటులోకి తీసుకు రాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి అధునాతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించి ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. వైద్య సిబ్బంది కొరత ఉండడం వల్ల అనారోగ్యాలతో రోగులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కెపి.నారాయణస్వామి, సిఐటియు నాయకులు కృష్ణ మద్దతు తెలిపారు. అనంతరం వైద్యులు శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు విఠల్, ఉల్లిగప్ప, రంగనాథ్, మణి, శివరాజు, మేఘశ్యామ్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, అధ్యక్షులు బసవరాజు, నాయకులు సురేష్ వర్మ పాల్గొన్నారు.

మాజీ ఎంపిటిసికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- ఆలూరు

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు మాజీ ఎంపిటిసి ఉరుకుందప్ప కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బి.విరు పాక్షి మంగళవారం ఉరుకుందప్ప ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకు న్నారు. ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి భరోసానిస్తూ ఆరోగ్య చికిత్స నిమిత్తం వైద్యులతో మాట్లాడి ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. నాయకులు వీరేష్, శేఖర్, రాజు పాల్గొన్నారు.

జిల్లా సాధనకు ఐక్య ఉద్యమాలు

- సాధన సమితి వ్యవస్థాపకులు నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

సమావేశంలో మాట్లాడుతున్న నూర్ అహ్మద్

ఆదోనిని జిల్లాగా ప్రభుత్వం ప్రకటించే వరకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆదోని జిల్లా సాధన సమితి వ్యవస్థాపకులు నూర్ అహ్మద్ కోరారు. మంగళ వారం పట్టణంలోని ఎపిఎన్‌జిఒ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా, విద్యార్థి, రాజకీయ పార్టీల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిం చారు. ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులు ఉషారాణి, ఎస్‌టియు నాయకులు నాగేంద్రప్ప, బీఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షులు శాంత కుమార్, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు నాగరాజు, బహుజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్, ఎంఎస్ఎఫ్ నాయకులు ప్రేమ్ కుమార్, సిపిఐ నాయకులు వీరేశ్, సుదర్శన్, సిపిఐ ఎంఎల్ నాయకులు మల్లికార్జున, మహిళా నాయకులు మణి, డిఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉదయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో వెనుకబడిన ఆదోని అభివృద్ధి కావాలంటే జిల్లా సాధనతోనే సాధ్యమన్నారు. పెద్ద వ్యవసాయ మార్కెట్ యార్డు, రైలు మార్గం, పరిశ్రమల స్థాపనకు నీటి వసతి, సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి, ఎన్‌జిఒస్ నాయకులు మంజునాథ్, ప్రమిలమ్మ, సురేష్, సాధన సమితి సభ్యులు నరేంద్ర యాదవ్, సిపిఐ సహాయ కార్యదర్శి రమేష్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ ఉన్నారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత..!

- కొత్త డీఎస్సీతోనైనా సమస్య తీరేనా..?

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలోని అక్షరాస్యతలో అత్యంత వెనుకబడిన మండలాల్లో ఒకటైన కౌతాళంలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. మండలంలో ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలు, ఉపాధ్యాయులే లేని పాఠశాలలు కూడా ఉన్నాయి. ఈ కారణంగా చదువులు ముందుకు సాగక, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా ఉన్న పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ కార్యక్రమాలు ఒకవైపు, విద్యార్థులకు బోధన చేయలేక కష్టాలు పడుతున్నారు..! ఈ సమస్యకు కొత్త డీఎస్సీతోనైనా అధికారులు పరిష్కారం చూపగలరా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు..!

మండలంలోని ఓ పాఠశాల...

జిల్లాలో పశ్చిమ ప్రాంతం కర్ణాటక సరిహద్దులో ఉన్న మండలం కౌతాళం. ఈ మండలంలో 58 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 15 హైస్కూల్స్, 3 యుపి స్కూల్స్, 30 ప్రైమరీ స్కూల్స్ ఉండగా 13,886 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇంతమంది విద్యార్థులకు 245 ఉపాధ్యాయులు అవసరం ఉండగా కేవలం 55 మంది రెగ్యులర్, 66 మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు ప్రార్థన, తరగతుల వారీగా హాజరు పట్టి, మరుగుదొడ్ల ఫొటోలు, ఆన్‌లైన్ నమోదు, మధ్యాహ్న భోజనం, వివిధ పరీక్షలు, మార్కుల నమోదు, ఆపార్ ఐడి నమోదుతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలు ఎన్నో నిర్వహించాల్సి ఉంది. దీనిని బట్టి పాఠశాలలో ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు విద్య బోధన ఏవిధంగా కొనసాగుతుందో అర్థమవుతుంది. ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు చేయలేక విద్యాబోధన ముందుకు సాగక ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు.

ఉపాధ్యాయులే లేని పాఠశాలలు

మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా, డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న పాఠశాలలు కూడా ఉన్నాయి. కామవరం, చూడి, ఉరుకుంద, ఎస్‌డబ్ల్యు.ఓబులాపురం, అగసలదిన్నె, వల్లూరు (కొత్త, పాత పాఠశాలలు), హాల్వి, ఎస్‌డబ్ల్యు.పొదలకుంట, బంటకుంట, హాల్వీ కొత్త పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులు డెప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు.

విద్యాశాఖాధికారులపై ఒత్తిడి

ఎంఇఒలు రామాంజనేయులు, శోభారాణి

మండలంలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యాధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ, మండల నాయకులు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉన్నతాధికారులు కృషి చేయాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాలలకు విద్యార్థులను పంపడానికి తల్లిదండ్రులు సంకోచిస్తున్నారు. ఈ విషయంపై ఎంఇఒలు రామాంజనేయులు, శోభారాణిని వివరణ కోరగా... మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉన్న విషయం వాస్తవమే, ఉన్న వారితో సర్దుబాటు చేసి ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ విషయంపై జిల్లా అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. కొత్త డీఎస్సీపైనే ఆశలు ఉన్నాయని, ఎక్కువ మంది ఉపాధ్యాయులను కౌతాళం మండలానికి కేటాయిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు.

స్ఫూర్తి దాత.. నారాయణ రెడ్డి..

- జడ్‌పి ఉన్నత పాఠశాలకు 4 ఎకరాల భూమి విరాళం

ప్రజాశక్తి - ఆలూరు

పాఠశాల నిర్మాణానికి భూమిని విరాళంగా ఇచ్చి టిడిపి నాయకులు నారాయణరెడ్డి స్ఫూర్తిగా నిలిచారు. ప్రస్తుతం భూమి రూ.లక్షలు పలుకుతున్న తరుణంలో తన సొంత గ్రామానికి మేలు చేయాలని, గ్రామంలో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే చదువుకోవాలని జడ్‌పి ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి నారాయణ రెడ్డి నాలుగు ఎకరాల భూమిని విరాళంగా ఇవ్వటానికి ముందుకొచ్చారు. ఆలూరు మండలం ముద్దనగేరి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణ రెడ్డి తన నాలుగు ఎకరాల భూమిని ఉన్నత పాఠశాలకు ఇచ్చేందుకు ముందుకు రావడంతో సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డిఇఇ విష్ణు వర్ధన్ రెడ్డి, ఆలూరు ఎంఇఒ-2 చిరంజీవి రెడ్డి అభినందించారు. మంగళవారం నారాయణ రెడ్డితో పాటు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే స్థలాన్ని స్కూల్ పేరు మీదుగా రిజిస్టర్ చేసి విద్యాశాఖ అధికారులకు అప్పగిస్తామని నారాయణ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు పి4లో భాగంగా అనాథ వృద్ధురాలిని దత్తత తీసుకుని ఆలనపాలన చూస్తున్నట్లు తెలిపారు. విద్య శాఖాధికారులు, సర్పంచి సుధాకర్ రెడ్డి, ప్రజలు నారాయణరెడ్డిని అభినందించారు.

భూమిని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

రూ.లక్షల్లో ఆదాయం.. సౌకర్యాలు శూన్యం..!

- ప్రయివేట్ స్థలంలో ఆస్పరి మార్కెట్ నిర్వహణ - సొంత స్థలం కొనుగోలుకు యత్నించని పంచాయతీ పాలకవర్గం

ప్రజాశక్తి - ఆస్పరి

రోడ్డుపై నిలిచిన వాహనాలు

ఆస్పరి టమోటా మార్కెట్ ఒకప్పుడు రాష్ట్రంలోనే ఎంతో ప్రసిద్ధి. దశాబ్దాల క్రితం స్థానిక ప్రాంత రైతులు జవారి టమోటా పంట సాగు చేసే వారు. కాలక్రమేణా జవారి టమోటాకు గిట్టుబాటు ధర లభించక హైబ్రిడ్ పంటకు డిమాండ్ పెరగడంతో టమోటా పంట సాగు విస్తీర్ణం తగ్గి మార్కెట్ నిర్వహణ ఆగిపోయింది. కొన్నేళ్లుగా వ్యవసాయ బోర్లు, వర్షాధారంపై ఆధారపడి టమోటా, కూరగాయల పంటలు సాగు పెరగడంతో కూరగాయల మార్కెట్ నిర్వహణకు జీవం పోసినట్లు అయింది. 2018 నుంచి 2025 వరకు (ఏడేళ్లు) ఆదాయం దాదాపు 2 కోట్ల దాకా మార్కెట్‌కు వచ్చిందని సమాచారం. ఈ డబ్బులతో మార్కెట్‌కు సొంత స్థలం కొనుగోలు చేయకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.లక్షల్లో ఆదాయం

కూరగాయల మార్కెట్‌కు ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. గతంలో బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మార్కెట్ రైతులకు అనుకూలంగా లేదని కొన్నేళ్ల క్రితం మార్కెట్‌ను కర్నూలు రోడ్డులోని ఇండియన్ పెట్రోల్ బంక్ దగ్గర ఉన్న ప్రయివేట్ స్థలానికి మార్చారు.

సౌకర్యాలు శూన్యం

కూరగాయల మార్కెట్లో రైతులకు సరయిన సౌకర్యాలు లేవు. ఎర్ర మట్టి కావడంతో వర్షం కురిస్తే మార్కెట్ మొత్తం చిత్తడిగా మారుతుంది. ప్రస్తుతం మార్కెట్ నిర్వహిస్తున్న ప్రయివేట్ స్థలం ఏ మాత్రం చాలడం లేదు. మార్కెట్‌కు రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా ప్రత్యేకంగా మార్కెట్ స్థలం కొనుగోలు చేసేందుకు పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకోకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలకవర్గం మార్కెట్ కోసం స్థలం కొనుగోలు చేయడంతో పాటు సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్‌కు స్థలం కొనుగోలు చేయాలి

- రంగస్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి

పంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా కూరగాయల మార్కెట్‌కు సొంత స్థలం లేకపోవడం దారుణం. కర్నూలు, బళ్లారి రోడ్డుపై అధిక లోడుతో వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డుపైనే మార్కెట్‌కు వచ్చిన రైతులు ఆటోలు, బొలేరో వాహనాలు ఆపుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. పంచాయతీ స్థలముంటే మార్కెట్ అభివృద్ధి చెందుతుంది. సొంత స్థలం కొనుగోలు చేసి, రైతులకు సౌకర్యాలు కల్పించాలి.

మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలి

- రైతు ఈరన్న, యాటకల్లు గ్రామం

కూరగాయల మార్కెట్‌కు వచ్చిన రైతులకు సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. సరుకు తీసుకొచ్చిన వాహనాలు నిలుపుకోవడానికి కూడా స్థలం లేదు. మార్కెట్ అధికారులు రైతులకు సౌకర్యాలు కల్పించాలి.

63 బస్తాల ఎరువులు సీజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ట్రేడర్స్‌లో 63 బస్తాల ఎరువులను సీజ్ చేశారు. మంగళవారం ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ శివ శంకర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ట్రైడర్స్‌ను తనిఖీ చేశారు. నందవరం రైతుల పేరు మీద బిల్లులు వేసి కర్ణాటక సరిహద్దుకు ఎరువులు తరలించినట్లు గుర్తించి మొత్తం 3 మెట్రిక్ టన్నులు (63 బస్తాలు) స్టాక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎఇఒ నరసింహుడు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కోసిగి

గ్రామంలో ఉన్న ఎరువుల దుకాణాలను మంగళవారం ఎక్సైజ్, పోలీసు సిబ్బందితో కలిసి ఎఒ వరప్రసాద్ తనిఖీ చేశారు. మండలంలోని మంజునాథ ట్రేడర్స్, గిరిజా ట్రేడర్స్, వాసవి ఫర్టిలైజర్స్, హనుమాన్ ఫర్టిలైజర్స్, లక్ష్మీనరసింహ స్వామి ఫర్టిలైజర్స్, శ్రీలక్ష్మీనరసింహస్వామి ట్రేడర్స్ దుకాణాలు, గోదాములను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ... మండలంలో ఎక్కడైనా గోదాముల్లో యూరియా నిల్వ ఉంచి రైతులకు అందుబాటులోకి తీసుకురాకుండా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా ఎరువుల దుకాణాలు నిర్వహించే వారు రిజిస్టర్లు, బిల్లు బుక్కులు తనిఖీ చేశారు. డిబిటి మిషన్‌లో ఎరువుల కొనుగోలు నమోదు చేయాలని తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్, ఎఎస్ఐ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు..

నిమజ్జనం ఘాటు పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వినాయక నిమజ్జనం ఘాట్‌ను మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పరిశీలించారు. మంగళవారం తుంగభద్ర దిగువ కాలువలో వినాయక నిమజ్జనం ఘాట్ ఏర్పాట్లు పరిశీలించారు. డిఇఇ నీరజ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు శ్రేయస్కరం

- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

వినాయక చవితి పండగకు మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణను పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు కోరారు. మంగళవారం స్థానిక పాత ఊరిలో ఉన్న శ్రీఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఉచితంగా వినాయక మట్టి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 8 ఏళ్లుగా మంచాలమ్మ దేవి ఆలయ పూజారి మూలింటి చంద్రశేఖర్ గౌడ్ కుమారులు సంతోష్ గౌడ్, రాఘవేంద్ర గౌడ్‌లు పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ఉచితంగా భక్తులకు ఇస్తున్నారని తెలిపారు.

పరుగు పోటీల్లో 'నేషనల్' ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

పరుగు పోటీల్లో నేషనల్ పాఠశాల విద్యార్థిని మేఘనా రెడ్డి ప్రతిభ చూపారు. మంగళవారం స్పోర్ట్స్ డే సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో నేషనల్ ఉన్నత పాఠశాలకు చెందిన మేఘనా రెడ్డి 400 మీటర్ల పరుగు పోటీల్లో ప్రతిభ చాటి విజేతగా నిలిచి, 100 మీటర్ల పరుగు పోటీల్లో నాలుగో స్థానం కైవసం చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. మేఘనా రెడ్డిని, విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు గోవిందు, రవిని నేషనల్, జిఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్యశ్రీ, డైరెక్టర్ ఎస్.విజయ్ కుమార్ అభినందనలు తెలిపారు.

టిడిపి మండలాధ్యక్షులుగా రామిరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

టిడిపి మండల అధ్యక్షులుగా పల్లెపాడు రామిరెడ్డిని మంగళవారం జిల్లా కమిటీ ఎన్నుకుంది. పార్టీ ఆవిర్భావం నుంచి రామిరెడ్డి టిడిపినే నమ్ముకుని అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీకి అండగా ఉన్నారని పలువురు సీనియర్ నాయకులు తెలిపారు. గతంలో ఎమ్మిగనూరు సమితి ఉన్నప్పుడు రెండు పర్యాయాలు, బీవీ.మోహన్ రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఒకసారి, 2014 నుంచి 2019 సంవత్సరాల మధ్యలో ఎల్ఎల్‌సి కాలువ మండల ఛైర్మన్ (డిసిసి) ప్రెసిడెంట్‌గా కూడా పదవులను అలంకరించారు. మండలంలో నాయకులకు అనుకూలంగా ఉంటూ టిడిపిలో చురుకుగా ఉండేవారు. టిడిపి మండల కమిటీలో మండల ఉపాధ్యక్షులుగా మహ్మద్ గౌస్, జనరల్ సెక్రటరీగా చంద్రహాస, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.సొట్టయ్య, ఉమా కాంత రెడ్డి, ఎం.అయ్యప్ప, మండల కార్యదర్శులుగా తోవి రామిరెడ్డి, హెచ్.నారాయణ, తిమ్మప్పను ఎన్నుకున్నారు.

టిడిపి మండలాధ్యక్షులుగా గోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



టిడిపి మండలాధ్యక్షులుగా ఎస్ఎం.గోపాల్ రెడ్డి ఎన్నికైనట్లు టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం కర్నూలులోని ఫంక్షన్ హాల్‌లో టిడిపి శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. పేదల కోసం రెండెకరాల భూమిని దానం చేసిన వ్యక్తి గోపాల్‌రెడ్డి అని చెప్పారు. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... రాఘవేంద్ర రెడ్డికి, ఎన్.రఘునాథ్ రెడ్డికి, సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డికి, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డికి రుణపడి ఉంటానని తెలిపారు.

యూరియా బూచి..!

- స్టాక్ కొరత చూపి దగా చేస్తున్న ప్రయివేట్ వ్యాపారులు

- మామూళ్ల మత్తులో వ్యవసాయాధికారి

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద ఆర్ఎస్‌కె వద్ద యూరియా కోసం ఎగబడిన రైతులు (ఫైల్)

ప్రస్తుతం పంటల సాగుకు యూరియా ఎంతో అవసరం. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగు చేసిన ప్రతి పంటకూ యూరియా ఎంతో అవసరం. రైతులందరికీ యూరియా అందించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం విఫలమయింది. ప్రయివేట్ ఎరువుల దుకాణాల యజమానులు కొరత బూచి చూపి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. రైతులకు యూరియాతో పాటు ఎరువులు, క్రిమిసంహారక మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అందుతున్నాయా లేదా అని అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లోకి వివిధ కంపెనీల పేరుతో నకిలీ క్రిమిసంహారక మందులు పక్క రాష్ట్రాల నుంచి వచ్చి చలామణి అవుతుండడంతో వాటిపై గట్టి నిఘా ఉంచి రైతులను రక్షించాల్సి ఉంది. వ్యవసాయ అధికారి మామూళ్ల మత్తులో పడి చోద్యం చూస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు.

మండలంలో సాగు విస్తీర్ణం

మండలంలో మొత్తం 32 వేల హెక్టార్ల భూమి విస్తీర్ణం ఉంది. ప్రతేడాది 25 వేల హెక్టార్ల వరకు పంటల సాగు జరుగుతోంది. మండలానికి ఆనుకొని ఎల్ఎల్‌సి కాలువ ప్రవహిస్తుండడంతో ప్రత్యేకంగా హొళగుందతో పాటు సమ్మతగేరి, మార్లమడికి, నాగరకన్వి, వన్నూరు, వన్నూర్ క్యాంపు, గజ్జహళ్లి, వందవాగలి, ఎండి హళ్లి, ఇంగలదహల్, హెబ్బటం తదితర గ్రామాల్లో దాదాపు 2 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. వరి ఎదుగుదలకు ఎకరాకు రెండున్నర బస్తాల చొప్పున యూరియా వాడతారు. ఇప్పటివరకు అందిన అరకొర యూరియాను పొలంలో వేసుకున్నట్లు రైతులు తెలిపారు. మిగిలిన 23 వేల హెక్టార్లలో పత్తి, మిరప, జొన్న, కంది, కొర్రలు తదితర పంటలు సాగు చేశారు.

రావాల్సింది కొండంత.. వచ్చింది గోరంత

మండలాల్లో 25 వేల హెక్టార్ల వరకు పంటలు సాగు జరిగితే ప్రతి ఎకరాకు రెండు బస్తాల ప్రకారం అవసరం అనుకుంటే 2.50 లక్షల బస్తాల యూరియా అవసరం. ఇప్పటివరకు ప్రయివేట్ డీలర్ల ద్వారా రైతులకు 12,154 బస్తాలు, ఆర్ఎస్‌కెల ద్వారా 10,245 బస్తాలు మొత్తం 22,398 బస్తాలు అందించినట్లు సమాచారం. ప్రతి రైతూ పక్కాగా యూరియా వాడగలిగితే ఇంకా 2,27,604 బస్తాల యూరియా అవసరమవుతుంది.

ఇంతవరకు యూరియా అందలేదు

- రైతు వీరేష్

ఇప్పటి వరకు నాకు ఒక్క బస్తా యూరియా కూడా అందలేదు. నాకున్న రెండెకరాలతో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. నాకు పది బస్తాల యూరియా అవసరమవుతుంది. ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా అందలేదు. పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకుని ఆర్ఎస్‌కె దగ్గరికి వెళితే 'యూరియా అయిపోయింది. మళ్లీ వస్తే ఇస్తామ'ని వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

నిర్లక్ష్యం వల్ల యూరియా కొరత

- రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు

వ్యవసాయ అధికారి నిర్లక్ష్యం కారణంగా రైతులకు యూరియా కొరత ఏర్పడింది. ప్రయివేట్ డీలర్ల దగ్గర యూరియా స్టాక్ ఎంత ఉంది.. రైతులకు ఎంత మేర అవసరమవుతాయి.. జిల్లా అధికారులకు ఎంత ఇండెంట్ ఇవ్వాలని అంచనా లేకుండా వ్యవహరించడం వల్ల మండలానికి యూరియా కొరత ఏర్పడింది. ప్రయివేట్ డీలర్ల వద్ద ఏయే కంపెనీకి సంబంధించిన క్రిమిసంహారక మందులు ఉన్నాయి.. అవి నకిలీవా.. ఒరిజినలా గుర్తించి రైతులకు నష్టం జరగకుండా చూడాలి. ప్రతిసారీ రైతులు నకిలీ మందులు, నకిలీ విత్తనాలు కొని తీవ్రంగా నష్టపోవడం చూస్తున్నాం. భవిష్యత్తులోనైనా జిల్లా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి, రైతు రైతుగా బతికేలా చూడాలి.

కొరత వాస్తవమే..!

- ఎఒ ఆనంద్ లోకదళ్

యూరియా కొరత ఉన్న మాట వాస్తవమే. జిల్లా అధికారులకు ఇండెంట్ పంపాం. నకిలీ క్రిమిసంహారక మందులు, విత్తనాలు మా తనిఖీల్లో బయట పడలేదు. దొరికితే ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, ఎంటర్‌ప్రైజెస్ ప్రయివేట్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి అనురాధ

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలో కొత్త పోలింగ్ కేంద్రాల ఆధునికీకరణకు ప్రతిపాదనలు పంపుతున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ పేర్కొన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో సుమారు 32 పోలింగ్ కేంద్రాల్లో 1,200 కంటే ఎక్కువగా ఓటర్లు ఉన్నందున ఆ పోలింగ్ కేంద్రాలను రెండుగా విభజించాల్సి వస్తోందని చెప్పారు. ఈ విషయంపై రాజకీయ పార్టీ ప్రతినిధుల అభిప్రాయ సేకరణ చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల ఆధునికీకరణ, కొత్త కేంద్రాల గుర్తింపు, ఓటరు నమోదు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. తహశీల్దార్ కె.రమాదేవి, పెద్దకడబూరు తహశీల్దార్ గీతా ప్రియదర్శిని, కౌతాళం తహశీల్దార్ రజనీకాంత రెడ్డి, కోసిగి తహశీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ జికె.గురు రాజ రావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

పండ్ల తోటల సాగుపై మరింత శ్రద్ధ

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రామాంజనేయులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి రైతూ పండ్ల తోటల సాగుపై శ్రద్ధ వహించి సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. మంగళవారం నంచర్ల గ్రామంలో ఆలూరు ఉద్యానవన శాఖ అధికారి కె.ఇందిరా ఆధ్వర్యంలో అమిద, మహ్మద్ రఫీలు అంజూర తోటలో నిర్మించుకున్న ప్యాక్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలూరు తాలూకాలో పండ్ల తోటలున్న ప్రతి రైతూ పండ్లను గ్రేడింగ్ చేసుకోడానికి అనుకూలంగా ఈ హార్టికల్చర్ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ ప్యాక్ హౌస్ నిర్మాణానికి 50 శాతం (రూ.2 లక్షలు) రాయితీని ఉద్యాన శాఖ అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని రామిరెడ్డి అనే రైతు పొలంలో మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న చామంతి మొక్కల తోటను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. మల్చింగ్‌కు కూడా ఉద్యాన శాఖలో రాయితీలు ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నంచర్లలో పూల తోటలను పరిశీలిస్తున్న రామాంజనేయులు, ఇందిరా

విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తారన్న అనుమానంతో

ఫర్టిలైజర్ యజమానులు పరార్

- తూతూమంత్రంగా వ్యవసాయ అధికారుల తనిఖీలు

- రైతుసంఘం నాయకులు దేవపుత్ర

- వినాయక చవితి సందర్భంగా బంద్ ఉండొచ్చు : ఎఒ సరిత

ప్రజాశక్తి - నందవరం

మూతపడిన షాపు

విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తారన్న అనుమానంతో ఫర్టిలైజర్ యజమానులు షాపులను బంద్ చేసి పరారైనట్లు రైతుసంఘం నాయకులు దేవపుత్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. రెండు రోజులుగా మండలంలో చాలా షాపులు తెరచుకోవడం లేదని, నాగలదిన్నె గ్రామంలో ఎరువులు దొరకక రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రైతులు ఉదయం నుంచి ఎదురు చూడగా 5 గంటల సమయంలో విజిలెన్స్ అధికారులు రారన్న సమాచారంతో కొన్ని షాపులు తెరచుకున్నాయని చెప్పారు. నిజాయతీగా వ్యాపారాలను కొనసాగిస్తున్నప్పుడు విజిలెన్స్ అధికారులకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. భయపడుతున్నారంటే రైతులను దోపిడీ చేస్తున్నట్లే కదా అని తెలిపారు. నందవరం గ్రామంలో కూడా ఉదయం నుంచి షాపులు తెరవలేదన్నారు.

తూతూమంత్రంగా తనిఖీలు : వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఫర్టిలైజర్ షాప్ యజమానుల ఆగడాలకు రైతుల బలవుతున్నారు. వ్యవసాయ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేయడంతో వారి ఆగడాలు కొనసాగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులకు ముడుపులు ముడుతున్నాయన్న అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. విజిలెన్స్ దాడుల గురించి అధికారులే వారికి సమాచారం చేరవేస్తున్నారని తెలిసింది. అధిక ధరలకు యూరియా కొన్నామని రైతులు వాపోతున్నారు. యూరియా కావాలంటే లింకు మందులు తప్పనిసరిగా తీసుకోవాలనే షరతులు కొన్ని షాపుల్లో పెట్టారని తెలిపారు. షాపు ఉన్నచోట కాకుండా వేరే చోట గోడౌన్ పెట్టారని రైతులు మండిపడ్డారు.

వినాయక చవితి సందర్భంగా బంద్ ఉండొచ్చు : ఎఒ సరిత

దేవపుత్ర

గత రెండు రోజులుగా ఫర్టిలైజర్ షాపులు సరిగా తెచ్చుకోవడం లేదు.. సెలవులు ప్రకటించారా అని ఎఒను వివరణ కోరగా... ఫర్టిలైజర్ షాపులకు సెలవు ఏమిటని ఆమె సమాధానమిచ్చారు. మండలంలో చాలా షాపులు తెచ్చుకోవట్లేదని తెలుపగా.. వినాయక చవితి సందర్భంగా బంద్ ఉండొచ్చని పొంతన లేని సమాధానాలను చెప్పు కొచ్చారు. కొద్దిరోజుల క్రితం కొన్ని షాపుల్లో స్టాక్ సీజ్ చేసినట్లు పుకార్లు వినిపిస్తున్నాయని ఆమెను కోరగా... నందవరం గ్రామానికి చెందిన ఒక షాపు, నాగలదిన్నె గ్రామంలో ఒక షాపు సుమారు రూ.లక్ష సరుకును సీజ్ చేశామని తెలిపారు. వాటి వివరాలను ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించగా... ఆరోజు డ్రైవు చేసే వ్యక్తి లేకపోవడంతో తెలపలేదన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, ADONI
I.P.NO. 9/2021
V.Yellappa. ...Petitioner
V/s
Gas Kuruva Venkatesh and 27 others. ...Respondents
GENERAL NOTICE
The above-named Petitioner has filed the above case for Insolvency petition. Hence, if anybody has got any objection with regard to the above petition, you are hereby directed to appear in person or through your pleader on date 19/09/2025 at 10:30 A.M., and file the objections if any, otherwise the petition will be decided on merits.
Sd/ T. MADHU SUDAN,
Advocate,
Adoni.

డిఎస్‌సి అభ్యర్థులు పోస్టు మార్చుకొనే అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎంపికయిన డిఎస్‌సి అభ్యర్థులకు తాము సెలెక్ట్ అయిన టీచర్ పోస్టులలో ప్రాధాన్యతను నిర్ణయించుకొనే అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు డిఆర్.గోపాల్ రెడ్డి, సురేష్ కుమార్ ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. మెగా డిఎస్‌సి 2025 నియామకాలలో అభ్యర్థులు ఒకటికంటే ఎక్కువ పోస్టులకు ఎంపికయి ఉన్నారన్నారు. డిఎస్‌సి నియామకాలలో ఎక్కువ సంఖ్యలో ఎస్‌జిటి పోస్టులు తక్కువ సంఖ్యలో టిజిటి, పిజిటి, స్కూల్ అసిస్టెంట్ వంటి పోస్టులు ఉన్నందున తీవ్రమైన పోటీ ఉన్నందున అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఎక్కువ సంఖ్యలో ఖాళీలు ఉన్న ఎస్‌జిటి స్థానానికి మొదటి ఆప్షన్, తదుపరి స్కూల్ అసిస్టెంట్, పిజిటి, టిజిటి వంటి పోస్టులకు ఎంపిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రతిభావంతులైన అభ్యర్థులు రెండు లేదా అంతకంటే ఎక్కువ పోస్టులకి అర్హత సాధించారన్నారు. ఎంపికైన అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని దరఖాస్తు చేసుకునే సమయంలో ఇచ్చిన ప్రాధాన్యత క్రమాన్ని కాకుండా ఎక్కువ స్థాయి గల పాఠశాల సహాయకుల పోస్టును ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పించాలని, వారి ప్రతిభకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

పోలకల్ లో పంటల పరిశోధన బృందం పర్యటన

ప్రజాశక్తి-సి బెళగల్

పోలకల్‌లో నంద్యాల జిల్లా స్థాయి పంటల పరిశోధనా బృందం మంగళవారం ఎఒ మల్లేష్ కుమార్ అధ్యక్షతన సందర్శించారు. శాస్త్రవేత్తలు విష్ణువర్ధన్, బాలాజీ నాయక్, చైతన్యలు పత్తి పంటను పరిశీలించి పంటల ఎదుగుదలకు యూరియా బాస్వరంను 30 రోజుల 60 రోజుల వ్యవధి దుక్కిలో ఒకేసారి కలిపి వేయాలన్నారు. గులాబీ రంగు పురుగు, రసం పీల్చు పురుగు నివారణకు జిగురు అట్టలను, లింగాకర్షణ బుట్టలను సలహాల మేర ఏర్పాటు చేసుకువాలని సూచించారు. పంటల దిగుబడి కోసం గిట్టుబాటు ధరల కోసం పంటల యాజమాన్య పద్ధతులను , సస్య రక్షణ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

వొకేషనల్ కళాశాలలో మదర్ థెరిసా జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం మదర్ థెరిసా 113వ జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామినాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శాంతి, కళాశాల ప్రిన్సిపల్ , లెక్చరర్స్ మదర్ థెరిసా చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కళాశాల లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్ , జబీన్ అక్తర్, సోమేష్, ఉల్గోజిరావు, చిన్న మల్లేశ్వరుడు , బాల శంకర్, శ్రావణి, జసింత ,విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ విద్యా సంస్థల చైర్మన్‌కు అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ది ఇన్నోవేటర్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు పొందిన శ్రీలక్ష్మీ విద్యాసంస్థల చైర్మన్ పి.దీక్షిత్‌ను మంగళవారం పలు ప్రజాసంఘాల నాయకులు కలిసి అభినందించారు. హౌస్ ఆఫ్ లార్డ్స్ బ్రిటిష్ పార్లమెంట్ యునైటెడ్ కింగ్‌డమ్‌లో వరల్డ్ స్కూల్స్ సమ్మిట్-2025 నుండి ది ఇన్నోవేటర్ ఇన్ ఎడ్యుకేషన్ క్యాటగిరిలో ఇండియా నుండి ఎంపికై బ్రిటిష్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్ సభ్యులు లార్డ్ డానియల్ బ్రెనన్ నుండి అవార్డును అందుకున్నారు. రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మదాసికురువ సుంకన్న, జిల్లా అధ్యక్షులు అశోక్ ఘనంగా సత్కరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మండలం దేవనబండ గ్రామంలోని తాగునీటి సమస్య ఉందని గ్రామ సర్పంచి ప్రవీణ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నారాయణదాసు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా మదర్ దేరిసా 115వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎంపిపి నారాయణదాసు ,అధికారులు పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామాలలో పారిశుధ్య పనులు లోపించడంతో విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు దృష్టికి తెచ్చారు. దూదేకొండ ఎంపిటిసి పెద్ద ఈరన్న పట్టణంలోని ఆర్ఎంపి డాక్టర్లు విచ్చలవిడిగా క్లినిక్లను ఏర్పాటు చేసుకొని ప్రజలు ప్రాణాలకు ముప్పు తీసుకొస్తున్నారని సభలో ప్రస్తావించారు. మండల వ్యవసాయ అధికారి వెంకటరాముడు మాట్లాడుతూ జూన్, జులై మాసాలలో తక్కువ వర్షపాతం నమోదయిందని అన్నారు. ఆగస్టు నెలలో వర్షాలు కురవడంతో పంటలు సమృద్ధిగా ఉన్నాయని, మండలంలో కరువు ఛాయలు లేవన్నారు. ఆయన మాటలు హాస్యాస్పదంగా ఉందని మండగిరి సర్పంచి ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు మొక్కుబడిగా హాజరై వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కవిత, తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్, వైస్

ఎంపీపీ రంగమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తఎంపిడిఒకు సన్మానం:79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు భాగంగా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా పత్తికొండ ఎంపిడిఒ కవిత ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఎంపిపి నారాయణదాసు ఆధ్వర్యంలో ఎపిడిఒను ఎంపిటిసిలు, పలువురు ప్రజాప్రతినిధులు పూలమాల శాలువాతో ఘనంగా

ప్రజా సేవలో బాధ్యతాయుతంగా ఉండాలి

-సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలి -ఫైళ్లను వేగంగా క్లియర్ చేయాలి

-నూతన కార్యాలయ నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సేవలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ నగరపాలక కార్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి విభాగం సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే వారిలో అసంతృప్తి పెరుగుతుందన్నారు. ఏ ఫైలు కూడా వాయిదా వేయకుండా, వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను సీరియస్‌గా పరిగణించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఫైళ్ల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి సమయపాలన తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ నిర్మాణంలో ఉన్న నూతన మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించారు. పనుల పురోగతి గురించి అధికారులను ఆరా తీశారు. ఈ కొత్త కార్యాలయం పూర్తయితే ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం లభిస్తుందన్నారు. పనులు నాణ్యతతో కూడినవిగా,

వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి దశలో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అక్కడ వెంటనే స్వచ్ఛత పనులను చేపట్టాలని, మున్సిపల్ కార్యాలయ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోలీసు కానిస్టేబుళ్ల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

ఎస్పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ వారి ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి జరిగిన వివిధ పరీక్షలలో ఉత్తీర్ణత పొంది కానిస్టేబుల్ ఉద్యోగాలను (సివిల్ ఎపిఎస్‌పి) సాధించిన అభ్యర్థులందరికీ జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో సోమవారం సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులకు, మంగళవారం ఎపిఎస్‌పి కానిస్టేబుల్ అభ్యర్థులకు సజావుగా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసిందని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. కానిస్టేబుల్ ఉద్యోగాల వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామన్నారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ డిపిఒసిబ్బంది సమగ్రంగా పరిశీలించారన్నారు. ఈ వెరిఫికేషన్ ప్రక్రియ కోసం జిల్లా

పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో మొత్తం 12 కౌంటర్లు ఏర్పాటు చేశారన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, క్రీడాసర్టిఫికేట్లు, కేటగిరీకి సంబంధించిన ధ్రువపత్రాలు సహా అన్ని అవసరమైన పత్రాలను సక్రమంగా పరిశీలించారన్నారు. సివిల్ , ఎపిఎస్‌పి విభాగాలకు ఎంపికైన మొత్తం 643 మంది అభ్యర్థులు వెరిఫికేషన్ ప్రక్రియకు హాజరవ్వాల్సి ఉండగా 617 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 26 మంది అభ్యర్థులు ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాలేదన్నారు. సివిల్ కానిస్టేబుల్స్ 309 మంది గానూ మొత్తం 298 హాజరయ్యారన్నారు. ఎపిఎస్‌పి 334 గానూ 319 మంది అభ్యర్థులు హాజరు అయ్యారన్నారు. ఈ ధృవీకరణ పత్రాల పరిశీన కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పిలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డిపిఒ ఎఒ విజయలక్ష్మి, ఆర్ఐ లు జావేద్, సోమశేఖర్ నాయక్ , డిపిఒ సూపరింటెండ్ పాల్గొన్నారు.

అధునాతన కెమిస్ట్రీ అనలైజర్ మిషన్ల ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆంధ్రప్రదేశ్ లోనే తొలిసారిగా బయో కెమిస్ట్రీకి సంబంధించిన రెండు అధునాతనమైన డిఎక్స్‌సి 700 ఎయు క్లినికల్ కెమిస్ట్రీ అనలైజర్ వైద్య పరికరాలను రూ. కోటి 20 లక్షల విలువైన మిషిన్ స్టాండ్ బై కింద బ్యాక్ మ్యాన్ కంపెనీ వారు స్పాన్సర్ చేశారని తెలిపారు. అనంతరం మంగళవారం కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ చేతులమీదుగా ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే హైయెస్ట్ ల్యాబ్ టెస్టులు బయో కెమిస్ట్రీ విభాగం నుండే చేస్తున్నామని అన్నారు. పేషంట్ల రద్దీ దృష్ట్యా త్వరగా రిపోర్టు అందించడానికి అధునాతనమైన యంత్రాలు అందుబాటులో తీసుకువచ్చామన్నారు. ఈ వైద్య పరికరాల ద్వారా పేషెంట్లకు ఖచ్చితమైన రిపోర్ట్, ఫాస్ట్ రిపోర్టింగ్ ద్వారా పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. బయో కెమిస్ట్రీ హెచ్ఒడి, డాక్టర్ రూత్ లావణ్య మాట్లాడుతూ ఆసుపత్రిలోని బయో కెమిస్ట్రీ విభాగానికి సహాయ సహకారాలు మరియు అధునాతనమైన వైద్య పరికరాలు రావడానికి ప్రధాన భూమిక పోషించిన ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంటుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్

సాయి సుధీర్, డాక్టర్ సింధ్య, ఇన్చార్జి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, బయో కెమిస్ట్రీ హెచ్ఒడి, డాక్టర్ రూత్ లావణ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణమోహన్, డాక్టర్ సుధాకర్, పీజీలు ఏపీ బ్యాక్ కౌల్టర్ మేనేజర్, దిప్షిక తదితరులు పాల్గొన్నారు.